# బీఆర్ఎస్‌లోకి పాల్వాయి స్రవంతి

## నేడు మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరిక

నల్లగొండ ప్రతినిధి, నవంబర్11(నమస్తే తెలంగాణ): ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్ఎస్‌లోకి వలస పరంపర కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కీలక నేతలు ఆయా నియోజకవర్గాల వారీగా పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కేటాయింపు వ్యవహారం డబ్బుతో కూడుకున్నది కావడంతో ఏండ్ల తరబడి పార్టీని అంటి పెట్టుకుని ఉన్న నేతలంతా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పెద్దల వైఖరితో విసిగిన నేతలంతా ఒక్కొక్కరుగా పార్టీని వీడుతూ బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. మునుగోడు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత, ఆది నుంచి గాంధీ కుటుంబానికి విధేయులుగా కొనసాగుతున్న పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కుటుంబానికి చివరకు ఇబ్బందులు తప్పలేదు. దాంతో గోవర్ధన్‌రెడ్డి కూతురు, ఏఐసీసీ సభ్యురాలు పాల్వాయి స్రవంతి పార్టీలో నేతల తీరు నచ్చక, పార్టీలో ఇమడలేక కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. గత మునుగోడు ఉప ఎన్నిక సమయంలో అప్పటి వరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేసిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం మధ్యలోనే కాంగ్రెస్ పార్టీని వదిలేసి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. ఆ సమయంలో సైతం పార్టీ పెద్దల సూచన మేరకు ఉప ఎన్నికల్లో ఎన్నో క్లిష్ట పరిస్థితుల నడుమ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. పార్టీ పరువు కాపాడేందుకు తీవ్రంగా శ్రమించి పార్టీ పట్ల తమ కుటుంబానికి ఉన్న విధేయతను చాటుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం ఎన్నికల్లో టికెట్ ఆశించిన పాల్వాయి స్రవంతిని కాదని తిరిగి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన రాజగోపాల్‌రెడ్డికి టికెట్టు కేటాయించడంతో ఆ పార్టీలో తీవ్ర కలకలం రేపింది. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని, పార్టీ నేతలను బండబూతులు తిట్టిన రాజగోపాల్‌రెడ్డి 10 నెలల్లోనే పార్టీకి ఎలా మంచి వాడయ్యాడన్నది సందేహాస్పదంగా మారింది. కేవలం డబ్బుంటేనే టికెట్టు అన్న పరిస్థితులను పార్టీలో తెచ్చిపెట్టారని, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డవారికి మొండిచేయి చూపడం నిజాయితీ కల నేతలను తీవ్రంగా కలిచివేసింది. పాల్వాయి స్రవంతి సైతం రాజగోపాల్‌రెడ్డికి టికెట్ కేటాయించడానికి జీర్ణించుకోలేక పోయారు. దాంతో ఆమె అనుచరులు, పాల్వాయి కుటుంబ అభిమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పార్టీకి గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తీవ్ర ఆవేదన స్వరంతో పాల్వాయి స్రవంతి ప్రకటించారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకి రాజీనామా లేఖను పంపుతూ పార్టీని వీడాల్సిన అనివార్య పరిస్థితులను అందులో స్పష్టం చేశారు.

### బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

పాల్వాయి స్రవంతి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిన బీఆర్ఎస్ కీలక నేత, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లోని పాల్వాయి స్రవంతి ఇంటికెళ్లి మంత్రి జగదీశ్‌రెడ్డి పలకరించారు. నల్లగొండ జిల్లాతో పాటు మునుగోడు అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌లో చేరాలని ఆహ్వానించారు. పని చేస్తున్న పార్టీ పట్ల పూర్తి విధేయతతో ఉండే పాల్వాయి కుటుంబం నుంచి వచ్చిన స్రవంతికి బీఆర్ఎస్‌లో సముచిత స్థానం ఉంటుందన్న భరోసా ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పాల్వాయి స్రవంతి అనుచరులు, అభిమానులతో చర్చించాక కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని శనివారం వెల్లడించారు. ఆదివారం ఉదయం తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు పాల్వాయి స్రవంతి ప్రకటించారు. నేడు దీపావళి కావడంతో కేవలం ముఖ్య అనుచరులతోనే పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.

### బ్రోకర్ల రాజ్యం నడుస్తున్నది : పాల్వాయి స్రవంతి

'కాంగ్రెస్ పార్టీనే నా కుటుంబం. ఆ పార్టీ జెండానే మా ఊపిరి అనుకున్నం. అనేక త్యాగాలు చేశాం. కానీ కాంగ్రెస్ పార్టీ కార్పొరేట్ సంస్థలా మారింది. డబ్బులు ఉంటేనే టికెట్ అంట. పార్టీలో ఎప్పటి నుంచి ఉన్నోళ్లను పట్టించుకోవడం లేదు. ఈ రోజు కొంత మంది బ్రోకర్లు వచ్చారు. వాళ్ల రాజ్యమే నడుస్తున్నది. పార్టీని పాతాళానికి తొక్కుతూ విలువ లేని పార్టీగా మార్చేశారు. అలాంటి నాయకత్వం కింద పార్టీలో ఉండాలంటే భయం వేస్తున్నది. ప్రజల పక్షాన నిలబడే వాళ్లు ఒక్కరూ కనిపించడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నా భావోద్వేగాన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా. నా నిర్ణయాన్ని హర్షించాలని, ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాట్లు, కాంగ్రెస్‌ను భారంగానే వీడుతున్న... ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా.... ఇబ్బందులు వచ్చినా పార్టీని వీడాలనుకోలేదు. ఇక్కడ పీసీసీ అధ్యక్షుడి పీఠం పై కూర్చొని బ్రదర్స్‌కు వత్తాసు పలకుతున్న పార్టీ వీడాలని అనుకు ంటున్న.'' అంటూ పాల్వాయి స్రవంతి తన రాజీనామాను ప్రకటించారు.

# ఎమ్మెల్యే కూసుకుంట్లతోనే మునుగోడు అభివృద్ధి


ప్రచారం నిర్వహిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ జంగారెడ్డి

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 11 : ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితోనే మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి చెందుతున్నదని పీఏసీఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 98, 99,100 బూత్‌ల పరిధిలో ఎమ్మెల్యే కూసుకుంట్లను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే మునుగోడు గడ్డ మీద గులాబీ జెండా ఎగురాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లె గోవర్ధన్‌రెడ్డి, బొడ్డుపల్లి గాలయ్య, సూరపల్లి వెంకటేశ్, రాసాల వెంకటేశ్, పాలకూర్ల సతీశ్, భిక్షమయ్య, జాని, బాకారం వెంకటేశ్, జనగాం నర్సింహ, చిరంజీవి, రాసాల ఆంజనేయులు, సింగం కృష్ణ, నవీన్, లింగస్వామి పాల్గొన్నారు.

# 10 నెలల్లోనే రూ.570 కోట్లతో అభివృద్ధి

- మునుగోడు నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించా
- మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తా
- కోతలరాయుడు రాజగోపాల్ రెడ్డిని నమ్మితే గోస పడ్తం
- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి


జైకేసారం గ్రామంలో ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్

చౌటుప్పల్‌రూరల్, నవంబర్11 : ఉప ఎన్నిక తర్వాత ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం.. 10 నెలల్లోనే నియోజక వర్గంలో 570 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినం..మరి కొన్ని పనులు కొనసాగుతున్నాయి.. ప్రజలు మరో వారు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతానని మునుగోడు నియోజక వర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జైకేసారం, కుంట్లగూడెం, నేలపట్ల, మందళ్ల గూడెం, ఎస్ లింగోటం, ఆరెగూడెం, పంతంగి, కాట్రేవు, ధర్మోజిగూడెం గ్రామాలలో కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌తో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు కూసుకుంట్లను ఘనంగా స్వాగతించారు. డప్పుచప్పుళ్లు, కోలాటాలతో స్వాగతం పలకడంతో పాటు మహిళలు బొట్టుపెట్టి, హారతిచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల కూడలిలో నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఊసరవెల్లిలా రోజుకో పార్టీ, పూటకో మాట మార్చే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాటలు నమ్మితే గతంలోలాగ మళ్లీ గోస పడతామని చెప్పారు. గతంలో రాజగోపాల్‌రెడ్డిని నమ్మి ఓటువేసి గెలిపిస్తే బీజేపీకి అమ్ముడుపోయి నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించకుండా కాంట్రాక్టుల కోసం పాకులాడాడన్నారు. తన స్వార్థం కోసం మునుగోడు ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాడన్నారు. గతంలో నమ్మి గెలిపిస్తే నాలుగేండ్లు కనిపించకుండా పోయిన వ్యక్తి మళ్లి మన గ్రామాలకు ఏ ముఖం పెట్టుకొని వస్తున్నాడని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఉప ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేయకుండా కేవలం 10 నెలల్లోనే నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించినట్లు చెప్పారు. తన బలం, బలగం అంతా మునుగోడు ప్రజలేనని, వారి అండదండలతోనే తిరిగి మునుగోడు సేవకుడిగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం ప్రజలకోసం, వారి సమస్యల పరిస్కారం కోసం మీలో ఓ ఇంటివాడిగా ఉంటానన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు అమలు చేసేందుకు బీఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేసి మ్యానిఫెస్టోలో ప్రకటించిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మునుగోడు ప్రజలు చైతన్యవంతులని.. కేవలం ఎన్నికల సందర్భంలో వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పే వారిని నమ్మరని పేర్కొన్నారు. కాంట్రాక్టుల కోసం పోటీ చేసేవారా.. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసే వారు కావాలా అనేది ప్రజలే నిర్ణయించాలని సూచించారు. ప్రజలు అమాయకులని, తాను ఎటు పోతే అటే వస్తారని భావిస్తున్న రాజగోపాల్‌రెడ్డికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఏగ్రామంలో చూసినా ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధి పనులు కనిపిస్తున్నాయని.. మరి ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా గెలిచి రాజగోపాల్‌రెడ్డి మునుగోడుకు ఏం చేశాడో చెప్పాలంటూ ప్రజలు నిలదీయాలని కోరారు. ఏనాడూ తట్టెడు మట్టి పోయని వారికి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. 2014 తర్వాత సీఎం కేసీఆర్ పాలనలోనే మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. ఓటు వేసే ముందు ప్రజలు ఈ విషయాలన్నీ ఆలోచించాలని, ఎమ్మెల్యేగా తనకు మరొక అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దింటి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గిరికాటి నిరంజన్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు సైదులు, చౌట వేణుగోపాల్, రిక్కల సత్తిరెడ్డి, కొలను శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొడ్డు సంజీవరెడ్డి, నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


జైకేసారంలో ఎమ్మెల్యే ప్రచారానికి అధిక సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు

### అభివృద్ధికి మద్దతుగా కలిసి వస్తున్న యువత

చౌటుప్పల్‌రూరల్ : రాష్ట్ర అభివృద్ధి కోసం యువత బీఆర్ఎస్ పార్టీతో కలిసి వస్తున్నారని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎస్.లింగోటం గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూసుకుంట్ల మాట్లాడుతూ పనులు చేసేవారిని ప్రజలు ఎన్నడూ మరువరన్నారు. పూటకో పార్టీ మారుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ముచేస్తున్న వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో బందేల శివ, తూర్పింటి నగేశ్, కందగట్ల తరుణ్, ఎర్రగోని మధు, చేరూరి సంజీవ, చెవిళ్ల నరేశ్, పల్చం పాపయ్య ఉన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన చౌటుప్పల్ మండలం ఎస్‌లింగోటం గ్రామ యువకులతో బీఆర్ఎస్ మునుగోడు అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

### బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి పల్లె రవికుమార్ పరామర్శ

చండూరు, నవంబర్ 11: మండలంలోని బోడంగిపర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ బొమ్మరబోయిన రామలింగం మృతికి కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. శనివారం గ్రామానికి వెళ్లి రామలింగం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన రవికుమార్‌గౌడ్, రూ. 25 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న, యువజన విభాగం అధ్యక్షుడు ఉజ్జిని అనిల్ రావు, నాయకులు ఎత్తపు మధుసూదన్‌రావు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కట్కూరి సత్తయ్య, వట్టికోటి శ్రీనివాస్, సరికొండ ముత్యాలు, పందుల భిక్షం, వరికుప్పల సురేశ్, వర్కల అంబేద్కర్, పప్పుల రామలింగయ్య, శంకరయ్య, నిరంజన్ పాల్గొన్నారు